# హౌటు ప్రిపేర్ ఫర్ ఇంగ్లిష్

తెలుగు మీడియం విద్యార్థులు మార్కులు రావని భయపడే విభాగం ఇంగ్లిష్. అయితే ఇది తప్పని ఎంతో మంది విద్యార్థులు మంచిమార్కులు సాధించడం ద్వారా నిరూపించారు. సరైన ప్రణాళిక, ప్రాథమిక అంశాలపై అవగాహన ఉంటే ఈ విభాగంలో మార్కులు సాధించడం చాలా సులభం. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. సిలబస్ రివిజన్ చేయడం పూర్తయింది. అయినా ఏదో తెలియని సందిగ్ధత. సిలబస్ నుంచే ప్రశ్నలు వస్తాయా, బయట ప్రశ్నలు అడిగితే ఎలా సమాధానం రాయాలి, పూర్తిమార్కులు సాధించాలంటే ఏ విధంగా సన్నద్ధం అవ్వాలి. పాస్ మార్కులు సాధించాలంటే కచ్చితంగా చదివి తీరాల్సిన పాఠ్యాంశాలు ఎన్ని.... ఇలా పరీక్ష రాసే వరకూ ఎన్నో సందేహాలు విద్యార్థికి కలగడం సహజం. వీటన్నింటినీ అధిగమించి పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమవ్వడం ఒక్కటే మార్గం. విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేందుకు నిష్ణాతులైన అధ్యాపకులు రూపొందించిన సులభమైన ప్రణాళిక ఇది.

**పేపర్-1 ప్రిపేరవ్వడం ఇలా:**

- పేపర్-1 సిలబస్‌లో పోయెట్రీ, ప్రోజ్, కాంప్రహెన్షన్, గ్రామర్ విభాగాలు ఉంటాయి. ఈ పేపర్ మొత్తం 50 మార్కులకు ఉంటుంది. ఇందులో గ్రామర్ 30 మార్కులు, ప్రశ్న సమాధానాలు, పోయెం, కాంప్రహెన్షన్‌లు కలిపి 20 మార్కులకు కేటాయించారు.

  వీటిని ప్రిపేరయ్యే విధానాన్ని చూస్తే

**పోయెట్రీ, ప్రోజ్:**

1) పోయెట్రీ, ప్రోజ్‌ల్లో ఉన్న మెసేజ్ ఓరియెంటెడ్ లెసన్స్(సందేశపూరిత పాఠ్యాంశాలు) చాలా ముఖ్యం.వీటిని క్షుణ్నంగా చదివితే ప్రశ్నల విభాగంలో అన్నింటికీ సమాధానాలు రాయవచ్చు. ప్రశ్నలకు రాసే సమాధానాలు సంక్షిప్తంగా ఉండాలి.
2) సిలబస్‌లో ఉన్న మొత్తం 6 పద్యాల్లో మూడు పద్యాలు చదివితే ఈ విభాగంలో పూర్తి మార్కులు అత్యంత సులభంగా సంపాదించవచ్చు. కచ్చితంగా చదవాల్సిన పోయెమ్స్( పద్యాలు)
   (1) బ్యాంగిల్ సెల్లర్స్,
   (2) వేర్ ద మైండ్ ఈజ్ విత్‌అవుట్ ఫియర్,
   (3) అన్ రిటెన్ రిజిస్ట్రీ
3) పద్యాలు రాసేటప్పుడు క్యాపిటల్ లెటర్స్, విరామ చిహ్నాలు సరిగా గుర్తించాలి.

**కాంప్రహెన్షన్:**

1) ఈ విభాగంలో పేరాగ్రాఫ్ ఇచ్చి సమాధానాలు రాయమంటారు. ఈ పేరాగ్రాఫ్‌లు పాఠ్యాంశ భాగాలనుంచే ఇస్తారు. ప్రతీ పాఠ్యాంశం వెనుక ఇచ్చే ఉదాహరణల్ని బాగా అధ్యయనం చేయాలి.
2) సమాధానాలు రాసేటప్పుడు ఐ, వుయ్, యూ అనే పదాలు ఉపయోగించకూడదు. ఇవి సర్వనామాలు. అందువల్ల వల్ల వీటిని ఉపయోగిస్తే మార్కులు కోల్పోయే అవకాశం ఉంది.
3) సమాధానం రాసేముందు ఇచ్చిన ప్రశ్నని ఒక టికి రెండు సార్లు చ దవాలి. అందువల్ల సరైన సమాధానం రాయడానికి వీలవుతుంది.
4) ఒకవేళ సరైన సమాధానం గుర్తించడంలో విఫలమైతే ప్రశ్నలో ఇచ్చిన భాగాన్ని పారాగ్రాఫ్‌లో వెతికి దాన్నే సమాధానంగా రాయాలి.

**గ్రామర్:**

ఈ పేపర్లో గ్రామర్‌కు 30 మార్కులు కేటాయించారంటేనే దాని విలువ అర్థం చేసుకోవచ్చు. తప్పులు లేకుండా సరైన సమాధానాలు రాస్తే పూర్తి మార్కులు సొంతం చేసుకోవచ్చు. అందుకోసం బేసిక్ గ్రామర్‌ను బాగా ప్రాక్టీస్ చేయాలి.

ముఖ్యంగా సబ్జెక్ట్, ఆబ్జెక్ట్స్, వెర్బ్స్, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ప్రిపోజిషన్స్, టెన్సెస్, యాక్టివ్, పాసివ్ వాయిస్‌లు, డిగ్రీస్, మ్యాచింగ్స్ మొదలైనవన్నీ క్షుణ్నంగా సాధన చేయాలి. వీటిని కంఠస్తం చేయకుండా అవగాహన చేసుకుని గ్రహించాలి. ఈ విభాగంలో స్పెల్లింగ్స్‌కు 3 మార్కులుంటాయి. వీటిలో పూర్తి మార్కులు సాధించేందుకు టెక్స్ట్‌బుక్ చివర్లో ఉండే లిస్ట్ ఆఫ్ న్యూ వర్డ్స్ చదవాలి.

ఈ సూచనలని పాటిస్తూ అందమైన దస్తూరీతో పరీక్ష రాస్తే ఇంచుమించుగా పూర్తి మార్కులు అంటే 48–49 మార్కులు సాధించడం సాధ్యమే.

**పేపర్–2 ప్రిపేరవ్వడం ఇలా:**

పేపర్–2కు కేటాయించిన 50 మార్కుల్లో ఎక్కువ భాగం ఉపవాచకం నుంచే వస్తాయి. అందువల్ల సప్లిమెంటరీ రీడర్‌లోని కథలపై పట్టు సాధిస్తే దీనిలో గరిష్ట మార్కులు సాధించవచ్చు.

కాంప్రహెన్షన్ విభాగంలో ఇచ్చే పేరాగ్రాఫ్‌కు 5 మార్కులు కేటాయించారు. 15 మార్కులకు ప్యాసేజెస్ అడుగుతారు. ఈ రెండు అంశాల్లో పూర్తి మార్కులు సాధించాలంటే ప్రాక్టీస్‌తోపాటు సబ్జెక్టుపై అవగాహన పెంపొందించుకోవాలి. 10 మార్కులకు అడిగే లెటర్‌రైటింగ్ చాలా ముఖ్యమైనది. ఈ విభాగానికి సమాధానం రాసేటప్పుడు ఇచ్చిన ప్రశ్నను సరిగా అర్థం చేసుకోవాలి. ప్రశ్నలో పర్సనల్ లెటర్ రాయమన్నారా? బిజినెస్ లెటరా? అనేది జాగ్రత్తగా గమనించాలి.

ఫ్రమ్ అడ్రస్, టు అడ్రస్, డేట్, ప్లేస్, రాసిన వెంటనే కామాలు పుల్ స్టాప్‌లు సరైన విధంగా గుర్తించాలి. బాడీ అఫ్ ది లెటర్ కు 3 మార్కులు మాత్రమే కేటాయిస్తారు. అంటే మిగిలిన వాటిని సరిగా రాస్తే 7 మార్కులు సాధించవచ్చు. బాడీ ఆఫ్ ది లెటర్ రాసేటప్పుడు పదాల కూర్పు విషయంలో జాగ్రత్త వహించాలి. వ్యాకరణ ప్రయోగం సరిగా ఉండాలి. ఈ అంశాలని పాటిస్తే ఈ విభాగంలో పూర్తి మార్కులు సాధించవచ్చు.

విద్యార్థులు సులభంగా మార్కులు సాధించే అవకాశం ఉన్న మరో విభాగం స్టోరీ రైటింగ్. దీనికి కేటాయించిన మార్కులు 10.

జాగ్రత్తగా ప్రిపేరైతే కనీసం 9 నుంచి 10 మార్కులు సాధించడం సులభమే. ఈ విభాగంలో నీతికి సంబంధించిన స్టోరీలు అడుగుతారు. ఈ విభాగంలో రాసే సమాధానం పేరాగ్రాఫ్‌లుగా విభజించి కనీసం రెండు పేరాగ్రాఫ్‌లుగా రాయాలి. ప్రశ్నలో ఇచ్చే ప్యాసేజ్ హింట్స్‌ను జాగ్రత్తగా డెవలప్ చేయాలి. రాసిన సమాధానానికి మంచి హెడ్డింగ్ (శీర్షిక) పెట్టాలి. స్టోరీ చివర్లో మోరల్.. అనే ట్యాగ్‌లైన్ పెట్టి మోరల్ సెంటెన్స్ రాస్తే దాదాపుగా పూర్తి మార్కులు సాధించినట్లే.

## పాస్ మార్కులు సాధించాలంటే?

1) పేపర్-1 ఇంగ్లిష్‌లో మూడు పద్యాలను కంఠస్థం చేయాలి. అచ్చు తప్పులు లేకుండా మక్కీకి మక్కీలా పోయెం రాయగలిగేలా ప్రిపేరవ్వాలి.
2) కాంప్రహెన్షన్‌లో అడిగే ప్రశ్నలన్నింటికీ సమాధానాలు రాయాలి. ఏదైనా ప్రశ్న అర్థం అవ్వలేదనిపిస్తే ప్యాసేజ్‌లో ఇచ్చిన సెంటెన్స్‌ను వెతికి దాన్నే సమాధానంగా రాయాలి
3) గ్రామర్లో ప్రాథమిక జ్ఞానం సంపాదించుకోవాలి.
4) పద్య, గద్య, ఉపవాచకాల నుంచి వచ్చే ప్రశ్నల్లో సులభంగా ఉన్న వాటిని గుర్తించి సమాధానాలు రాయండి. ఆయా విభాగాల నుంచి కనీసం మొదటి రెండు పాఠాల ప్రశ్నలైనా కంఠస్థం చేయాలి. అలా చేస్తే సగానికి కన్నా ఎక్కువ ప్రశ్నలకు సమాధానం రాసేందుకు అవకాశం ఉంటుంది.
5) లెటర్ రైటింగ్, స్టోరీ రైటింగ్‌లు జాగ్రత్తగా రాయాలి.
6) ముఖ్యంగా బాడీ ఆఫ్ ది లెటర్ సరిగా రాయలేక పోయినా ఫ్రమ్ అడ్రస్, టు అడ్రస్, డేట్, ప్లేస్, కామాలు, పుల్ స్టాప్‌లు సరిగా గుర్తిస్తే 7 మార్కులు సంపాదించవచ్చు.
   ఇంగ్లీష్ విభాగంపై పట్టు లేని విద్యార్థులు ఈ అంశాల్ని పాటిస్తే సులభంగా పాస్ అవ్వడమే కాదు కనీసం 50 నుంచి 60 శాతం మార్కులు సాధించవచ్చు.